సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 19 । అక్టోబర్ । 2025

గరిష్టం / కనిష్టం
29° / 23°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

కొత్తగూడెంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు రుద్రహోమం

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఐటీడీఏకు ఉత్తమ అవార్డు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో కేంద్ర పథకాలను విజయవంతంగా అమలు చేసినందుకు గాను కేంద్ర ప్రభుత్వం బెస్ట్ ఐటీడీఏ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు పీఓ రాహుల్ శనివారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ధర్తీ ఆభాజాన్ జాతీయ గౌరవ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ పరిధిలోని 19 మండలాల్లో గల 130 గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం ప్రారంభించామని, ఈ మేరకు గిరిజన సంక్షేమ, విద్యా, వైద్య, గ్రామీణాభివృద్ధి శాఖలను సమన్వయం చేస్తూ పనులు చేపట్టామని వివరించారు. విజన్ 2030 నాటికి ఆయా గ్రామాలు అభివృద్ధి పథంలో నడిచేలా అన్ని శాఖలను అప్రమత్తం చేశామని వివరించారు. అవార్డు ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన పీఓ.. ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో ప్రతిభ చాటిన ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలిపారు.

నాణ్యమైన బొగ్గుతోనే సింగరేణికి పేరు



వీకే-7 ఓసీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఈడీ వెంకన్న

సింగరేణి(కొత్తగూడెం): వినియోగదారులకు కావాల్సిన నాణ్యమైన బొగ్గు అందించడం ద్వారా సింగరేణి పేరు నిలుస్తుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూవ్‌మెంట్), చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బాదావత్ వెంకన్న తెలిపారు. కొత్తగూడెం ఏరియాలోని వీకే-7 ఓసీ, ఓసీ సీహెచ్‌పీ పనులను ఆయన శనివారం తనిఖీ చేశారు. రుద్రంపూర్ ప్రాంతంలోని మాయాబజార్ వద్ద నిర్మించే సీహెచ్‌పీ ప్లాన్‌పై ఆరా తీశారు. నవంబర్‌లో వీకే-7 ఓసీ మొదలైతే బొగ్గు ఉత్పత్తి, రవాణా మెరుగుపడుతుందని తెలిపారు. ఆ తర్వాత వ్యాగన్ లోడింగ్ పాయింట్, పీవీకే బంకర్ పాయింట్, రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు సత్తుపల్లి ఓసీల నుంచి వచ్చే బొగ్గు నాణ్యతను పరిశీలించారు. ఏరియా జీఎం శాలేంరాజు, ఏరియా ఇంజనీర్ కె.సూర్యనారాయణ రాజు, అధికారులు రామకృష్ణ, శ్రీరమేష్, ఖనిరామ్ భరోసే మహతో, వి.శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

రక్షణ హుష్ కాకి!



కొత్తగూడెంలో బాణసంచా దుకాణం వద్దకు పెట్రోల్ వాహనంపై వచ్చిన కొనుగోలుదారులు

తుస్సుమన్న నిబంధనలు

- జిల్లా వ్యాప్తంగా 163 బాణసంచా దుకాణాల ఏర్పాటు
- అనుమతులు రాకముందే మొదలైన విక్రయాలు
- కనీస జాగ్రత్తలు పాటించని వ్యాపారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రమాదాలకు అవకాశమున్న బాణసంచా దుకాణాల విషయంలో కనీస పర్యవేక్షణ కొరవడింది. అనుమతులు రాకుండానే, కనీస జాగ్రత్తలు సైతం లేకుండానే దుకాణాలు నిర్మిస్తున్నా సంబంధిత ప్రభుత్వ విభాగాలు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నాయి.

అనుమతులతో పని లేదా?

దీపావళి పండగ సందర్భంగా తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, స్థానిక సంస్థలు, విద్యుత్, పోలీస్, అగ్నిమాపక శాఖల అనుమతులు అవసరం. జిల్లా వ్యాప్తంగా దుకాణాల ఏర్పాటుకు 166 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో మూడు తిరస్కరణకు గురికాగా 163 దుకాణాలకు అగ్నిమాపక శాఖ నుంచి శనివారం సాయంత్రం అనుమతులు జారీ అయ్యాయి. అయితే, అనుమతి రాకముందే గురు, శుక్రవారాల్లోనే తాత్కాలిక దుకాణాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని దుకాణాల్లో శనివారం మధ్యాహ్నం నుంచే అమ్మకాలు కూడా మొదలయ్యాయి. అనుమతులు లేకుండా దుకాణాల నిర్మాణం, బాణ సంచా అమ్మకాలు జరుగుతున్నా సంబంధిత ఐదు ప్రభుత్వ విభాగాల్లో ఏ ఒక్క శాఖ కూడా అభ్యంతరం చెప్పకపోవడం గమనార్హం. కనీసం దుకాణాలు నిర్మించే సమయంలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారా లేదా అనే విషయాన్ని కూడా పూర్తిస్థాయిలో పరిగణనలోకి తీసుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

పట్టించుకునేవారేరి?

పండగ సంబరాలు చేసుకునేందుకు ప్రజలు చూపే ఉత్సాహాన్ని సొమ్ము చేసుకోవడం పైనే బాణాసంచా వ్యాపారులు దృష్టి పెడుతున్నారు కానీ.. తమ వద్దకు వచ్చే వినియోగదారులకు ఎటువంటి హానీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం లేదు. వ్యాపారులు ఇష్టానుసారం దుకాణాలు ఏర్పాటుచేస్తుంటే వాటిని పర్యవేక్షించడం, నిబంధనలకు అనుగుణంగా సవరణలు, సూచనలు చేయాల్సిన వేర్వేరు ప్రభుత్వ విభాగాలు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రం వరకు ఈ తరహా నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా పట్టించుకునే వారు, వాటిని సరిదిద్దేవారు కరువయ్యారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. హెల్మెట్లు పెట్టుకోలేదని, ట్రిపుల్ రైడింగ్ అంటూ సామాన్యులపై ఎడాపెడా జరిమానాలు విధించే పోలీసు శాఖ అయినా బాణాసంచా దుకాణాల దగ్గర భద్రతా లోపాలు సరిదిద్దాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

నిబంధనలు బేఖాతర్ !

బాణాసంచా దుకాణాల నిర్మాణంలో క్లాత్, ఉడ్, టార్పాలిన్ లాంటి కాలే స్వభావం ఉన్న వస్తువులు ఉపయోగించకూడదు. షాపు నిర్మాణంలో ఆస్‌బెస్టాస్ లేదా సిమెంట్ రేకులు ఉపయోగించాలి. కానీ ఈ నిబంధన చాలా చోట్ల అమలుకు నోచుకోలేదు. కొత్తగూడెంలో అయితే ఏకంగా వేగంగా మండే స్వభావం ఉన్న టార్పాలిన్లు, పాలిస్టర్ క్లాత్‌ను ఉపయోగించారు. రెండు దుకాణాల మధ్య మూడు మీటర్ల గ్యాప్ ఉండేలా చూడాలి. కానీ చాలా దుకాణాలు పక్కపక్కన ఆనుకునే ఉన్నాయి. అక్కడక్కడగా గ్యాప్ ఇచ్చినా మీటర్ దూరమే ఉంది. ప్రతీ షాప్ ఎదుట ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ నిబంధన కాగితాలకే పరిమితమైంది. తూతూ మంత్రంగా నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు.

బంద్ ప్రశాంతం

- డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- పలు పార్టీలు, కార్మిక సంఘాల నిరసనలు
- ఆర్టీసీకి రూ.25 లక్షల మేర నష్టం
- మూతబడిన పెట్రోల్ బంకులు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/చుంచుపల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించిన బంద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. అఖిల పక్ష పార్టీలు, ప్రజా, కులసంఘాల ఆధ్వర్యంలో కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. పాత బస్‌డిపో నుంచి ఎంజీ రోడ్, సూపర్ బజార్ సెంటర్, అండర్ బ్రిడ్జి, బస్టాండ్ సెంటర్ మీదుగా పోస్టాఫీస్ సెంటర్ వరకు ప్రదర్శన, మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పార్టీలు, ప్రజాసంఘాల బాధ్యులు మాట్లాడుతూ.. గత 70 సంవత్సరాలుగా బీసీలు రాజకీయంగా అంటరానితనాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శాస్త్రీయంగా నిర్వహించిన సమగ్ర, సామాజిక, ఆర్థిక సర్వేలో బీసీల జనాభా 56.33 శాతంగా ఉందని నివేదికలు వచ్చాయని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కాగా, బంద్ సందర్భంగా పెట్రోల్ బంకులు, హోటళ్లు, వివిధ వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూతబడ్డాయి.



ఏపీ బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రోడ్డెక్కని బస్సులు..

జిల్లాలో బంద్ ప్రభావంతో కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల పరిధిలో ఉదయం నుంచే బస్సులు రోడ్డెక్కకుండా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రధాన బస్టాండ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. జిల్లా నుంచి హైదరాబాద్, ఖమ్మం, ఇల్లెందు, వరంగల్, గోదావరిఖని, మణుగూరు, భద్రాచలం, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు బస్సులు ఆగిపోయాయి. అద్దె బస్సుల యజమానులు సైతం పూర్తిస్థాయిలో బీసీ బంద్‌కు మద్దతు తెలిపారు. కాగా, మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత వివిధ ప్రాంతాలకు బస్సులు తిప్పినా.. నాలుగు డిపోల పరిధిలో దాదాపు రూ. 25లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు అధికారుల అంచనా.



బంద్ ప్రభావంతో నిర్మానుష్యంగా మారిన కొత్తగూడెం బస్టాండ్

అదనపు కోర్టులు ఏర్పాటు చేయండి

హైకోర్టు జడ్జికి 'బార్' సభ్యుల విన్నపం

బూర్గంపాడు/కొత్తగూడెంటౌన్ : ప్రజల సౌలభ్యం కోసం భద్రాచలంలో అదనపు సెషన్స్ కోర్టు లేదా అసిస్టెంట్ సెషన్స్ కోర్టును, కొత్తగూడెంలో ఎస్సీ, ఎస్టీ కేసుల కోసం ప్రత్యేక న్యాయస్థానాన్ని, ఫ్యామిలీ కోర్టు, జువైనల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటు చేయాలని కొత్తగూడెం, భద్రాచలం బార్ అసోసియేషన్ల సభ్యులు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జె.శ్రీనివాసరావును కోరారు. సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో భద్రాచలం బార్ సభ్యులు, కొత్తగూడెం కోర్టులో స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు ఈ మేరకు జడ్జికి వినతిపత్రాలు అందించారు. భద్రాచలం, మణుగూరు సబ్ డివిజన్లలో 600 పైగా సెషన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, జిల్లా కేంద్రం కొత్తగూడెం వెళ్లాలంటే ఈ ప్రాంత వాసులకు అసౌకర్యంగా ఉందని వివరించారు. ఆ తర్వాత కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తదితరులు శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి పాటిల్ వసత్, అదనపు జిల్లా జడ్జి సరిత, సీనియర్ జడ్జిలు ఎం.రాజేందర్, కె.కిరణ్‌కుమార్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.కవిత, జూనియర్ జడ్జిలు కె.సాయిశ్రీ, బి.రవికుమార్, వి.శివనాయక్, డి.కీర్తిచంద్రికారెడ్డి బి.భవాని, కె.సురారెడ్డి, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, సభ్యులు జె.గోపీకృష్ణ, భాగం మాధవరావు, కాసాని రమేష్, ఉప్పు అరుణ్, ఆడపాల పార్వతి, మాలోత్ ప్రసాద్, కె.చిన్నికృష్ణ, కొడాలి శ్రీనివాసన్, పసుపులేటి రాంబాబు, రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జి శ్రీనివాసరావును సన్మానిస్తున్న 'బార్' సభ్యులు, పక్కన జిల్లా జడ్జి పాటిల్ వసంత్

‘ఎక్సైజ్’కు కిక్కు..

- రాత్రి వరకూ కొనసాగిన దరఖాస్తుల స్వీకరణ
- 23న కొత్త మద్యం దుకాణాలకు డ్రా
- టెండర్లు తగ్గినా.. పెరగనున్న ఆదాయం
- దరఖాస్తుదారుల్లో పాతవారే అధికం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో కొత్త మద్యం దుకాణాలకు చివరి రోజైన శనివారం భారీగానే దరఖాస్తులు అందగా రాత్రి వరకూ స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. టెండర్లకు నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి దరఖాస్తులు అంతంతగానే వచ్చాయి. మొదటి వారం రోజులైతే పదుల సంఖ్యలోనే రావడంతో ఎక్సైజ్ అధికారులు ఆందోళన చెందారు. కానీ నెమ్మదిగా దరఖాస్తుల సంఖ్య పెరిగింది. ఈ సంవత్సరం టెండర్ ఫీజు రూ.3లక్షలకు పెంచడంతో దరఖాస్తుదారులకు అదనపు భారంగా మారింది. జిల్లాలో దరఖాస్తులను పరిశీలిస్తే.. కొత్తవారు అంతగా ఆదరణ చూపకున్నా గతంలో టెండర్లు దక్కించుకున్న వారు ఫీజును సైతం లెక్కచేయకుండా దరఖాస్తులు అందించారు. ఈ ఏడాది నవంబర్ 30తో పాత వారి లైసెన్స్ కాలపరిమితి ముగియనుండగా కొత్తగా టెండర్ దక్కించుకున్నవారు డిసెంబర్ 1 నుంచి మద్యం విక్రయాలు ప్రారంభించాల్సి ఉంటుంది. జిల్లాలో 88 వైన్ షాపులు, 13 బార్లు ఉన్నాయి. 2023లో జరిగిన మద్యం టెండర్ ప్రక్రియలో రూ.2 లక్షల ఫీజుతో మొత్తం 5,057 దరఖాస్తులు అందగా డ్రా తీసి 88 దుకాణాల వారికి లైసెన్స్‌లు జారీ చేశారు. ఈ ఏడాది కూడా జిల్లాలోని 88 షాపులకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గతనెల 26న ప్రారంభమై శనివారంతో ముగిసింది. రాత్రి 11 గంటల వరకు 3,727 దరఖాస్తులు అందగా ఎక్సైజ్ శాఖకు రూ.111.81 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే దరఖాస్తుల స్వీకరణ ఇంకా కొనసాగుతూనే ఉంది.

23న మద్యం దుకాణాలకు డ్రా..

జిల్లాలో కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగియగా ఈనెల 23న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సమక్షంలో డ్రా తీయనున్నారు. జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేటలో ఎక్సైజ్ పోలీసుస్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్ల వారీగా కౌంటర్లు ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని 88 మద్యం దుకాణాలకు గానూ 44 ఎస్టీలకు, 7 ఎస్సీలకు, 31 ఓపెన్, 6 గౌడ కులస్తులకు కేటాయించారు. డ్రాలో టెండర్ దక్కిన వారు ఈనెల 23, 24 తేదీల్లో నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కొత్త మద్యం దుకాణాలకు 2027 నవంబర్ 30 వరకు కాలపరిమితి ఉంటుంది. 2023లో నిర్వహించిన టెండర్లలో పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయం దగ్గర ఉన్న వైన్‌షాపునకు అత్యధికంగా 124 దరఖాస్తులు రాగా, ఇల్లెందులోని ఓ దుకాణానికి అత్యల్పంగా 22 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గతేడాది రూ.2 లక్షల ఫీజుతో 5,057 దరఖాస్తులు రాగా, ఈ ఏడాది దరఖాస్తులు తగ్గినప్పటికీ గతం కంటే ఎక్కువ ఆదాయం ఎక్సైజ్ శాఖకు సమకూరనుంది.



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట దరఖాస్తులు పూర్తి చేస్తున్న టెండర్‌దారులు

చేతివృత్తులతో స్వావలంబన సాధించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): యువత చేతివృత్తుల కోర్సులు అభ్యసించడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించి, సమాజంలో స్థిర స్థానం సంపాదించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. హైదరాబాద్‌లో ఎన్ఎస్‌టీఐ-ఎఫ్ఎఫ్ఎస్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫర్నిచర్ ప్రొడక్షన్ అసిస్టెంట్' శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతివృత్తులు ఎప్పటికీ కాలాతీతం కాని నైపుణ్యాలని అన్నారు. యువత మూడు నెలల పాటు కష్టపడి శిక్షణ పూర్తి చేశారని తెలిపారు. వారి నైపుణ్యాలతో భవిష్యత్‌లో స్థిరమైన ఉపాధి అవకాశాలు పొందడమే కాక ఇతరులకు కూడా ప్రేరణగా నిలుస్తారని అన్నారు. శిక్షణ పూర్తయిన వారికి నెలకు రూ.15వేల నుంచి రూ. 30 వేల వరకు పారితోషికంతో ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. మరి కొందరు రూ.లక్ష వరకు వేతనాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఫర్నిచర్ అండ్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్ (ఎఫ్ఎఫ్ఎస్‌సీ) రీజనల్ వైస్ ప్రెసిడెంట్ పి. ప్రశాంత్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్ఎస్‌టీఐ సంస్థ నిర్వహించిందని వివరించారు.

దీపావళికి బీఎస్ఎన్ఎల్ కొత్త ప్లాన్

ఖమ్మంమయూరిసెంటర్: దీపావళి పండుగ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల కోసం కొత్త ప్లాన్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఉమ్మడి జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజశేఖర్ బాబు తెలిపారు. రూ.1కే సిమ్ అందించడమే కాక 30 రోజుల కాల పరిమితితో అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు ఉంటాయని పేర్కొన్నారు. కొత్తగా సిమ్ తీసుకునే వారికే కాక పోర్టబిలిటీ వినియోగదారులకు సైతం ఈ ప్లాన్ వర్తిస్తుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం సమీపంలోని కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించాలని డీజీఎం ఓ ప్రకటనలో సూచించారు.

ఓవరాల్ చాంపియన్ 'భద్రాద్రి'



ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న అటవీ ఉద్యోగులు

పాల్వంచరూరల్ : అటవీ ఉద్యోగుల రాష్ట్రస్థాయి పోటీల్లో భద్రాద్రి జోన్ క్రీడాకారులు ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో ఈనెల 17, 18 తేదీల్లో జరిగిన రాష్ట్ర అటవీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్‌లో భద్రాద్రి జోన్ (వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాలు)నుంచి 166 మంది ఉద్యోగులు పాల్గొని వివిధ క్రీడల్లో సత్తా చాటారు. మార్చ్‌ఫాస్ట్, మహిళల వాలీబాల్, మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు, తాడు లాగుడు పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ కూడా కైవసం చేసుకోవడం విశేషం. ఈ మేరకు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రామలింగం చేతుల మీదుగా కప్ అందుకునారు. క్రీడాకారులను ఎఫ్‌డీఓలు కట్టా దామోదర్‌రెడ్డి, బి.బాబు అభినందించారు.

చూసొద్దాం రండీ !



పోచవరం పాయింట్ వద్ద పర్యాటకుల సందడి(ఫైల్)

సండే స్పెషల్

- పునః ప్రారంభమవుతున్న పాపికొండల యాత్ర
- వరదలతో ఆగిపోయిన పర్యాటకం
- రాజమండ్రి వైపు ఇప్పటికే మొదలు..
- నేడో, రేపో పోచవరం పాయింట్ వైపు

భద్రాచలం : భద్రాచలం ఏజెన్సీలో పర్యాటక రంగానికి పట్టుగొమ్మలాంటి పాపికొండల యాత్ర మళ్లీ సిద్ధమవుతోంది. వర్షాకాల సీజన్‌లో గోదావరి వరదల నేపథ్యంలో పర్యాటక యాత్ర నిలిచిపోగా.. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టి గోదావరి ప్రవాహం నిలకడగా ఉండడంతో తిరిగి ప్రారంభించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఏపీలోని రాజమండ్రి గండిపోచమ్మ ఫెర్రీ పాయింట్‌కు అనుమతులు రావడంతో వారం క్రితమే అక్కడ ప్రారంభించారు. కాగా గోదావరికి ఇవతల వైపున ఉన్న పోచవరం పాయింట్‌కు నేడో, రేపో అధికారిక అనుమతి రానుందని లాంచీల యజమానులు చెబుతున్నారు. దీంతో ఈ సీజన్‌కు పాపికొండల పర్యాటకాన్ని తిలకించేందుకు పలువురు రెడీ అవుతున్నారు.

దసరా నాటికే కావాల్సి ఉన్నా..

ప్రతి ఏడాది భద్రాచలం నుంచి పరవళ్లు తొక్కుతున్న గోదావరికి జూన్ నుంచి సెప్టెంబర్ వరకు భారీగా వరదలు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో గోదావరి ఉధృతిని దృష్టిలో పెట్టుకుని పాపికొండల విహారయాత్ర నిలిపేస్తుంటారు. ఈ ఏడాది జూలైలోనే ఈ యాత్రకు బ్రేక్ పడింది. ఈ సంవత్సరం భారీ వరదలు రాకున్నా గోదావరి నదీ ప్రవాహం నిరంతరం 30 – 45 అడుగుల మధ్య నమోదవుతూనే ఉంది. ఈ ఏడాది అత్యధిక పర్యాయాలు గోదావరి పరవళ్లు తొక్కడంతో పాపికొండల యాత్ర ఆలస్యమైంది. దసరా సెలవుల నుంచే పర్యాటక సీజన్ ప్రారంభం అవుతుంది. కానీ ఈ ఏడాది విజయదశమి నాటికి కూడా గోదావరి ప్రవాహం సాధారణ స్థాయికి రాకపోవడంతో జాప్యం జరిగింది.

దీపావళి నేపథ్యంలో ఎదురుచూపులు..

మూడు నెలలుగా ఆగిపోయిన పాపికొండల పర్యాటకానికి ఇప్పుడు వాతావరణం అనుకూలంగా మారింది. దీంతో ఏపీ ప్రభుత్వం రాజమండ్రి వైపు నుంచి అనుమతి ఇచ్చింది. గండిపోచమ్మ గుడి బోటింగ్ పాయింట్ వద్ద వారం క్రితమే యాత్ర ప్రారంభమైంది. అయితే తెలంగాణ వైపు నుంచి అత్యధికంగా పర్యాటకులు వచ్చే పోచవరం పాయింట్ వద్ద అనుమతి కోసం ఏజెంట్లు, లాంచీల యజమానులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఆదివారం, దీపావళి సెలవులు రావడంతో త్వరగా అనుమతిస్తే బాగుండేదని అంటున్నారు. యాత్రకు సంబంధించిన అన్ని పత్రాలూ సమర్పించామని, ప్రభుత్వం నుంచి అనుమతి రావడమే ఆలస్యమని లాంచీల యజమానులు చెబుతున్నారు. వీరితో పాటుగా పర్యాటకంపై ఆధారపడి జీవిస్తున్న వివిధ రంగాల ప్రజలు సైతం యాత్ర ప్రారంభం కోసం వేచిచూస్తున్నారు. పాపికొండల యాత్ర ప్రారంభమైతే ఇటు ఆధ్యాత్మిక క్షేత్రమైన భద్రగిరిలోనూ భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంటుంది.

పాత ధరలే అమలు..

పచ్చని అడవులు, వాటి నడుమ అమాయక ఆదివాసీల జీవన విధానం, కట్టుబొట్టు, సంస్కృతి, సంప్రదాయాలు దర్శనమిచ్చే పాపికొండల యాత్ర ఎంతో మధురానుభూతిని నింపుతుంది. రెండు రోజుల్లో కార్తీక మాసం సైతం ప్రారంభం కానుండడంతో భక్తులు, పర్యాటకులు అధికంగా వస్తుంటారు. ఈ నేపథ్యంలో పాపికొండల పర్యాటక ధరలను గతంలో మాదిరిగానే నిర్ణయించారు. పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750 చొప్పున వసూలు చేయనున్నారు. ఇక కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ప్యాకేజీలు ప్రకటించాల్సి ఉంది. పోచవరం ఫెర్రీ పాయింట్ వద్దకు చేరుకోవడానికి సొంత వాహనాల్లో లేదంటే భద్రాచలంలో ప్రైవేట్ వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయి.



గోదావరిలో లాంచీ విహారం (ఫైల్)

నేడో, రేపో ప్రారంభమవుతుంది

పాపికొండల విహార యాత్ర నేడో, రేపో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజమండ్రి వైపు యాత్ర నడుస్తోంది. పోచవరం బోటింగ్ పాయింట్ వద్ద లాంచీలు సిద్ధంగా ఉన్నాయి. అనుమతి వస్తే ఇక సందడిగా మారనుంది.

– మహేందర్, టికెట్ల విక్రయ కేంద్రం నిర్వాహకుడు, భద్రాచలం

నూతన డీపీఓగా అనూష



అనూష

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో 62వ ర్యాంకుతో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) పోస్టుకు ఎంపికైన బొప్పన అనూషను జిల్లాకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం ఆరు జిల్లాలకు డీపీఓలను నియమించగా.. జిల్లాకు అనూష ఎంపికయ్యారు. ఆమె స్వస్థలం ఖమ్మం.

క్లుప్తంగా

కమ్మేసిన పొగమంచు



పొగమంచులో కరకగూడెం ప్రధాన రహదారి

కరకగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో పొగమంచు కమ్మేస్తోంది. పచ్చని పొలాలపై కమ్ముకుని ప్రకృతి రమణీయతను చాటుతోంది. సమీపంలోకి వచ్చేవరకు రహదారులపై వాహనాలు కనిపించడంలేదు. శనివారం కరకగూడెం ప్రధాన రహదారిపై, పొలాల్లో పొగమంచు దట్టంగా అలుముకుంది.

పాఠశాలకు శాశ్వత భవనం నిర్మిస్తాం

అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్ శర్మ



విద్యార్థినితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్ శర్మ

పాల్వంచరూరల్: పూరిపాకలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించేలా చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్ శర్మ అన్నారు. మండల పరిధిలోని బంద్రుగొండ గ్రామపంచాయతీ ఆదివాసీల నివాసప్రాంతమైన కొయ్యగట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరామ్మూర్తి, విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్లు ఎస్.సతీష్‌కుమార్, ఎస్‌కె సైదులు పాల్గొన్నారు.

రోటరీ సీఎస్సార్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న నవలిమిటెడ్ సంస్థ ప్రతినిధులు

పాల్వంచ: రోటరీ ఇండియా నేషనల్ సీఎస్ఆర్ అవార్డ్–2025 అవార్డ్‌ను పాల్వంచలోని నవ లిమిటెడ్ సంస్థ అందుకుంది. ఈ నెల 17న బెంగళూరు చాంచారి పెవిలియన్ వేదికగా జరిగిన రోటరీ ఇండియా నేషనల్ సీఎస్సార్ అవార్డ్స్ రీజియన్ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఉమారెడ్డి చేతుల మీదుగా నవ లిమిటెడ్ ప్రెసిడెంట్ ఎల్‌వి.శరత్ బాబు, సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్ వివిఎస్.రాజు, జనరల్ మేనేజర్(సీఎస్ఆర్) ఎంజీఎం ప్రసాద్‌లు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం, విద్య, జీవనోపాధులు, ఇతర కార్యక్రమాల ద్వారా సామాజిక అభివృద్ధికి నవ లిమిటెడ్ చేస్తున్న కృషిని గుర్తించి అవార్డు అందించారని తెలిపారు.

గర్భిణి కడుపులో శిశువు మృతి

భద్రాచలంఅర్బన్: గర్భిణి కడుపులో ఉన్న శిశువు మృతి చెందగా.. అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆమె బంధువులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. భద్రాచలంకు చెందిన ప్రవీణ్ కుమార్ – ఉషశ్రీకి మూడేళ్ల క్రితం వివాహం జరగగా ఆమె కొద్దినెలల క్రితం గర్భం దాల్చింది. గత మూడు నెలలుగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయిస్తుంటే శిశువు ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు. ఈ నెల ప్రసవం జరుగుతుందని చెప్పగా, శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఉషశ్రీకి కడుపులో నొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెకు నర్సులు పరీక్షలు నిర్వహించాక రాత్రి 7గంటలకు వైద్యురాలు వచ్చి పరిస్థితి విషమించిందంటూ ఆపరేషన్ చేసి మృతి శిశువును బయటకు తీశారు. ఇంకా సమయం గడిస్తే తల్లి పరిస్థితి కూడా విషమించేదని, వైద్యురాలు, నర్సుల నిర్లక్ష్యంతో ఇలా జరిగిందని ఉషశ్రీ భర్త ప్రవీణ్‌కుమార్ ఆరోపించాడు. ఈమేరకు ఆస్పత్రి ఎదుట ఆమె బంధువులు ఆందోళనకు దిగారు.

ముష్టికుంట్ల వాసికి డాక్టరేట్



కే.వీ.నారాయణ

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన కేవీ నారాయణకు డాక్టరేట్ లభించింది. 'ది రైటింగ్స్ ఆఫ్ ఆర్‌కే నారాయణ్, ఎన్‌రిచ్‌మెంట్ ఆఫ్ ఇండియన్ ఇంగ్లిష్' అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి ఉత్తరప్రదేశ్‌లోని జేఎస్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. కాగా, నారాయణ ప్రస్తుతం ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

ఊరూరా ఉపాధి గుర్తింపు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు కసరత్తు

- పనుల ఎంపికకు ఇటీవల ప్రారంభమైన గ్రామసభలు
- జాతీయ ఉపాధి హామీలో జల సంరక్షణకు ప్రాధాన్యం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

జిల్లాలో ఉపాధి హామీ పథకం వివరాలు	
మొత్తం జాబ్‌కార్డులు	2.23 లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డులు	1.31 లక్షలు
మొత్తం కూలీలు	4.58 లక్షలు
యాక్టివ్ కూలీలు	2.21 లక్షలు

మంచుపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. మూడు, నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన సభలు నవంబర్ 30లోగా పూర్తిచేయనున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వచ్చే ఆర్థిక సంవత్సరం(2026–27)లో చేపట్టబోయే ఉపాధి పనుల గుర్తింపునకు, ఎక్కువ మంది కూలీలకు పని కల్పించేలా డీఆర్డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉపాధిహామీ ఏపీఓలు, సాంకేతిక సహాయకులు, కార్యదర్శులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పనుల వివరాలు సేకరిస్తున్నారు. గ్రామసభల్లో పనులపై చర్చించి ఆమోదం పొందనున్నారు. ఉపాధి సిబ్బంది లేబర్ బడ్జెట్‌ను అంచనా వేస్తారు. ఈసారి జలవనరుల సంరక్షణతోపాటు రైతులకు, కూలీలకు ఎక్కువగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. గుర్తించిన పనులకు బడ్జెట్ రూపొందించి, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆమోదించాక కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తారు. కేంద్రం నుంచి అనుమతులు రాగానే వచ్చే ఏప్రిల్ నుంచి లేబర్ బడ్జెట్ ఆధారంగా జిల్లాలో ఉపాధి పనులను చేపట్టనున్నారు.

గ్రామసభల్లో చర్చించి..

గ్రామసభల్లో తమకు అవసరమైన పనులను ఎంపిక చేసుకునే వెసులుబాటు గ్రామస్తులకు, రైతు సంఘాలకు ఉంటుంది. ఎంపీడీఓలు, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామసభలకు హాజరై చేపట్టబోయే పనులపై గ్రామస్తులతో చర్చిస్తారు. తర్వాత ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్లు అంచనాలు రూపొందిస్తారు. మొదట గ్రామస్థాయిలో నివేదికలు ఆమోదించాక, మండల, జిల్లా స్థాయికి పంపించాలి. జిల్లాస్థాయి వార్షిక ప్రణాళికలను 2026 జనవరిలో, అదే నెలలో రాష్ట్రస్థాయిలో ఆమోదిస్తారు. మార్చి 31న కేంద్రం ప్రభుత్వం లేబర్ బడ్జెట్‌ను ప్రకటిస్తుంది. దీనికి అనుగుణంగా పంచాయతీల వారీగా గ్రామసభలను నిర్వహించి కావాల్సిన పనులను గుర్తించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ప్రణాళికలను రూపొందించారు.

ఏయే పనులు చేపడతారంటే..

ఉపాధిహామీ పథకంలో దాదాపు 250 రకాల పనులు నిర్వహించవచ్చు. జిల్లాలో మాత్రం 39 రకాల అనుకూలమైన పనులకు మాత్రమే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వీటిలో నీటి కుంటలు, కందకాల తవ్వకం, చెరువుల పూడికతీత, పశువులు, మేకలు పాకలు, పశుగ్రాసం పెంపకం, పండ్ల తోటలు, పొలం గట్లు, కాలువ గట్లపై చెట్ల పెంపకం, వర్షపు నీటి మళ్లింపు కాలువలు, ఫామ్‌పాండ్స్, ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, ఫిష్ పాండ్స్, పౌల్ట్రీ షెడ్లు, బంజరు భూములకు సాగుకు యోగ్యంగా మార్చడం వంటి పనులు ఉన్నాయి. సామాజిక పనులైన సీసీ రహదారులు, మట్టి రోడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, నర్సరీల నిర్వహణ, హరితహారం మొక్కల సంరక్షణ, గ్రామ పంచాయతీ, మహిళా సంఘాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, మల్టీ యూనిట్ టాయిలెట్లు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, రూరల్ హాట్‌లు, భవన నిర్మాణ సామగ్రి తయారీ, తాగునీటి తొట్లు, పశువుల షెడ్లు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం వంటి పనులు చేపడుతారు.

నవంబర్‌లోగా సభలు పూర్తి



రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే ఉపాధి పనులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నాం. పనులకు పక్కా ప్రణాళికలను రూపొందిస్తాం. రైతులకు, కూలీలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పిస్తాం. నవంబర్ నెల చివరి నాటికి ఉపాధి గ్రామసభలను పూర్తి చేస్తాం.

–ఎన్.రవి, అదనపు డీఆర్డీఓ

మధ్యవర్తిత్వమే ప్రాణం తీసిందా?

- రూ. 40 లక్షలు వసూలు చేసి మరొకరికి అప్పగింత
- ఉద్యోగాలు రాకపోవడంతో డబ్బులు తిరిగివ్వాలని బాధితుల ఒత్తిడి
- గత మే నెలలో అనారోగ్యంతో మృతి
- 2024లో తీసుకున్న ఆత్మహత్య సెల్ఫీ వీడియో తాజాగా వెలుగులోకి



సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన మృతుడి వీడియో దృశ్యం

పాల్వంచ: కేటీపీఎస్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలతో నిరుద్యోగులకు వల వేసి రూ.లక్షలు వసూళ్లు చేశారు. ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో మధ్యవర్తిత్వం వహించిన వ్యక్తిపై ఒత్తిడి పెరిగింది. దీంతో మనోవేదన చెంది అనారోగ్యం బారినపడి గత మే నెలలో అతను మృతి చెందాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానని 2024లో తీసుకున్న సెల్ఫీ వీడియో శనివారం సామాజిక మాధ్యమాల్లో వెలుగు చూడగా, పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని పాత పాల్వంచ గడియకట్టకు చెందిన అనుముల సైదులు(37) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. జ్వరంతో గత మే 12న మృతి చెందాడు. సైదులు పాత పాల్వంచకు చెందిన కొలిపాక శ్రీనివాస్ మాటలు నమ్మి మధ్యవర్తిత్వం వహించి నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూళ్లు చేశాడు. తొలుత అతనే ఉద్యోగం కోసం శ్రీనివాస్‌కు రూ.8లక్షలు ఇచ్చాడు. అనంతరం అతని బావమరిది నుంచి రూ.5లక్షలు, హరీష్, లక్ష్మణ్, సతీష్, సాయి, మరో ఇద్దరు మహిళలు, మరో బంధువు నుంచి ఇలా మొత్తం రూ.40 లక్షల వరకు వసూలు చేసి శ్రీనివాస్‌కు ఇచ్చాడు. ఉద్యోగాలు ఇప్పించకపోగా డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదు. కోర్టుల్లో కేసులు పెండింగ్ ఉన్నాయంటూ శ్రీనివాస్ కాలయాపన చేశాడు. దీంతో డబ్బులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగి సైదులు మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో మనోవేదన చెంది మృతి చెందాడని కుటుంబీకులు చెబుతున్నారు.

కారకులపై చర్యలు తీసుకోవాలి..



మాట్లాడుతున్న స్వర్ణ

సెల్ఫీ వీడియోలో డబ్బులు ఎవరెవరి వద్ద ఎంత తీసుకున్న, ఎవరికీ ఇచ్చింది మొత్తం వివరించాడు. ఈ విషయంలో ఎస్పీ రోహిత్ రాజు స్పందించి న్యాయం చేయాలని కోరాడు. తనను శ్రీనివాస్ మోసం చేయడం వల్లే చనిపోతున్నానని తెలిపాడు. శనివారం మృతుడు సైదులు భార్య స్వర్ణ విలేకరులతో మాట్లాడుతూ శ్రీనివాస్ మోసం చేయడంతో డబ్బులు ఇచ్చినవారు ఒత్తిడి చేశారని, దీంతో మనవేదనకు గురై మృతి చెందాడని తెలిపింది. తనకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, తన భర్త మృతికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ విషయమై ఎస్ఐ సుమన్‌ను వివరణ కోరగా.. ఈ వ్యవహారం ఫిర్యాదు రాలేదని తెలిపారు. 2024 సంవత్సరంలో సైదులు సెల్ఫీ వీడియో తీసుకున్నాడని, 2025 మేలో అతను జ్వరంతో చనిపోయాడని పేర్కొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు



గుట్ట వద్ద అక్రమంగా మట్టి తవ్వుతున్న దృశ్యం

టేకులపల్లి: మండలంలోని తొమ్మిదోమైలుతండా శ్మశాన వాటిక, డంపింగ్ యార్డు వెనకాల పార్కు సమీపంలో ఉన్న గుట్ట మట్టి తవ్వకాలతో కరిగిపోతోంది. ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టి తవ్వి తరలిస్తున్నారు. నాలుగు నెలల నుంచి యథేచ్ఛగా పగలు రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మట్టితోలుతున్న ట్రాక్టర్లను మైనర్ బాలురు నడుపుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు నడుపుతుండగా, అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. గ్రామ పంచాయతీ ఆదాయానికి గండికొడుతూ, గుట్ట మట్టిని స్వాహా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏరియా ఆస్పత్రి నుంచి రిఫర్..

మార్గమధ్యలో 108 వాహనంలో ప్రసవం



తల్లీబిడ్డలతో 108 సిబ్బంది

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట గ్రామానికి చెందిన ఇర్ప దేవి పురిటి నొప్పులతో శనివారం ఇల్లెందు ప్రభుత్వాసుపత్రిలో చేరింది. అక్కడి వైద్యులు ఆమెను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమై ప్రసవించింది. ఈఎంటీ రేణుకాదేవి సేవలందించారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు. ఉమ్మనీరు తక్కువగా ఉందని, తల్లి కడుపులో బిడ్డ కదలికలు సరిగా తెలియడం లేదని ఇల్లెందు ఆస్పత్రి సిబ్బంది చెప్పారని, ఆ వెంటనే సీ సెక్షన్ కోసం ఎనస్తీషియా ఇవ్వగా మత్తు ఎక్కలేదని పేర్కొంటూ ఖమ్మం రిఫర్ చేశారని ఇర్ప దేవి చెప్పినట్లు 108 సిబ్బంది వివరించారు. గర్భిణికి 108 సిబ్బంది వాహనంలోనే సాధారణ కాన్పు చేశారు. అయితే గర్భిణిని ఖమ్మం రిఫర్ చేసేందుకు వైద్యులు చూపిన కారణాలు ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ప్రశ్నలు ఉత్పన్నం చేసేలా ఉన్నాయి. ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉరి వేసుకుని బలవన్మరణం

కారేపల్లి: మానసిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని సూర్య తండాకు చెందిన మాలోతు తావుర్యా – లక్ష్మి దంపతుల కుమారుడు సాయికుమార్ (25) రైల్వే కాంట్రాక్టు పనులు చేస్తుంటాడు. ఇటీవల బెంగళూరు ప్రాంతంలో పనులకు వెళ్లిన ఆయన ఈనెల 17న తిరిగి రాగా, మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. తల్లి లక్ష్మి అస్వస్థతకు గురికాగా ఆమెను చికిత్స నిమిత్తం తావుర్యా ఖమ్మం తీసుకెళ్లాడు. శనివారం సాయంత్రం వరకు స్నేహితులతో గడిపిన సాయికుమార్ ఉన్నట్టుండి ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుని ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు తలుపు పగలకొట్టి సాయికుమార్‌ను ఇల్లెందు ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

కారులో జర్నీ.. స్టార్ హోటళ్లలో బస

- 20 కేసుల్లో నిందితుడిగా హైటెక్ దొంగ
- వివరాలు వెల్లడించిన ఖమ్మం ఏసీపీ రమణమూర్తి



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణమూర్తి, పక్కన సీఐలు, ఎస్ఐలు

ఖమ్మంఅర్బన్: యుక్త వయస్సులోనే ఇంటి నుంచి పారిపోయి చిన్నచిన్న పనులు చేస్తే వచ్చే డబ్బుతో సంతృప్తి లభించలేదు. దీంతో చోరీల బాట ఎంచుకున్న సదరు వ్యక్తి పలు కేసుల్లో శిక్ష అనుభవించినా తీరు మార్చుకోలేదు. చోరీసొత్తుతో కొన్న కారులోనే దొంగతనాలకు వెళ్లే ఆ నిందితుడు ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేస్తూ విలాసవంతమైన జీవనం సాగిస్తుండగా ఖమ్మంలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం నగర ఏసీపీ రమణమూర్తి వివరాలు వెల్లడించారు.

గుంటూరు నుంచి హైదరాబాద్‌కు..

ఏపీలోని గుంటూరు జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన మిక్కిలి వంశీకృష్ణ అలియాస్ శ్యామ్‌రిచర్డ్ 17 ఏళ్ల వయస్సులోనే ఇంటి నుంచి పారిపోయాడు. హైదరాబాద్‌లోని ఓ జిరాక్స్ సెంటర్‌లో పనికి కుదిరినా వచ్చే డబ్బు సరిపోక దొంగతనాలు మొదలుపెట్టాడు. అలా హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, ఎస్‌ఆర్‌నగర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేసేవాడు. ఫలితంగా పోలీసులకు పట్టుబడి పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చినా తీరు మార్చుకోలేదు. జిల్లాలోని ఖానాపురం హవేలీ, ఖమ్మం – 1, 2, 3 టౌన్‌తో పాటు రూరల్, నేలకొండపల్లి, కూసుమంచి, వైరా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇరవై ఇళ్లలో చోరీ చేశాడు. శుక్రవారం సాయంత్రం ఖమ్మంఅర్బన్ పోలీసులు ఖమ్మం – వైరా రహదారిపై వాహన తనిఖీలు చేపడుతుండగా కారులో వెళ్తున్న వంశీకృష్ణ వివరాలు ఆరా తీశారు. దీంతో చోరీల విషయం బయటపడింది. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలు చేసినట్లు అంగీకరించడంతో 452 గ్రాముల బంగారు నగలు (ప్రస్తుత విలువ రూ.51 లక్షలు), చోరీ సొమ్ముతో కొన్న ఎంజీ ఆస్టర్ కారు (రూ.15 లక్షలు) కలిపి రూ.66 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. కాగా, చోరీ సొత్తును ఎప్పటికప్పుడు అమ్మేసే వంశీకృష్ణ ఆ డబ్బుతో బెంగళూరు, గోవా, హైదరాబాద్ నగరాల్లోని ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేస్తూ విలాసవంతమైన జీవితం గడిపేవాడని వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్, ఎస్ఐ డి.శ్రావణ్‌కుమార్, సిబ్బంది వి.బాబు, వి.హరికృష్ణను ఏసీపీ అభినందించారు.

26న 'సింగరేణి' జాబ్‌మేళా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 26న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. సంస్థ ఆధ్వర్యాన నిర్వహించే జాబ్‌మేళా పోస్టర్లను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సింగరేణి గనులతో కిష్టారం వాసులు నష్టపోయినందున గ్రామంలో పర్యావరణ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసు కోవాలని సూచించారు. అలాగే, సైలో బంకర్ నుంచి వాయు కాలుష్యం వెలువడకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని తెలిపారు. మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, చల సాని సాంబశివరావు, సింగరేణి పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు పాల్గొన్నారు.

ఐరన్ లారీ, డీసీఎం ఢీ

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జయిన డీసీఎం ముందు భాగం

దమ్మపేట : ఐరన్ లారీని సీఎం వ్యాన్ ఢీకొని డ్రైవర్ గాయపడ్డ ఘటన మండలంలోని మొద్దులగూడెం గ్రామ శివారులో శనివారం జరిగింది.స్థానికుల కథనం ప్రకారం ... అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వైపు ఐరన్ లోడ్‌తో లారీ వెళ్తోంది. ఈ క్రమంలో మొద్దులగూడెం శివారు వద్ద అదే మార్గంలో వెళ్తున్న డీసీఎం వ్యాను వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్ ద్వారా సత్తుపల్లి తరలించారు. డీసీఎం ముందు భాగమంతా నుజ్జునుజ్జయింది.

నగదు చోరీపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: నగదు చోరీ ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై యయాతీ రాజు కథనం ప్రకారం.. అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఏఎస్సార్ కాలనీకి చెందిన గన్నవరపు రాజారావు (దాబా రాజు) శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంక్‌లో మద్యం దుకాణానికి డీడీ తీసేందుకు రూ.2.50 లక్షల నగదును తన ద్విచక్రవాహనానికి తగిలించిన సంచిలో పెట్టి సమీపంలోనే ఉన్న ఓ బ్యాంక్ మిత్ర వద్దకు వెళ్లాడు. బ్యాంక్ మిత్ర వద్ద మరో రూ.50 వేలు డ్రా చేస్తున్న క్రమంలోనే గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి నగదు ఉన్న సంచిని కాజేశారు. కొద్దిసేపటి తర్వాత గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆయా ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు నగదు కాజేసి పారిపోయినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ సీజ్

బూర్గంపాడు: మండల పరిధిలోని జింకలగూడెం గ్రామ సమీపంలోని కిన్నెరసాని కెనాల్ వద్ద నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపారు. లారీ ఓనర్, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ములకలపల్లిలో ట్రాక్టర్..

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై ఎస్ మధుప్రసాద్ కథనం మేరకు .. మండల పరిధిలోని సీతారాంపురం శివారులో ముర్రేడు వాగు నుంచి ఇసుక అక్రమంగా తోలుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించి, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

బోనకల్: మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి కుంచం సందీప్ (16) శనివారం మృతిచెందాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం కళాశాలకు వెళ్లడం ఇష్టంలేక ఇటీవల గడ్డిమందు తాగాడు. దీంతో గుర్తించిన ఆయన తల్లిదండ్రులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు.

యంత్ర సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించాలి

సింగరేణి డైరెక్టర్ తిరుమలరావు



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరావు

మణుగూరు టౌన్: బొగ్గు, ఓబీ వెలికితీతలో యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) తిరుమలరావు అన్నారు. శనివారం మణుగూరులో పర్యటించిన ఆయన ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌తో కలిసి పీకేఓసీ–2, 4 గనులను వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీతలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీహెచ్‌పీ వరకు బెల్ట్ కన్వేయర్ సిస్టం నిర్మాణాన్ని పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులతో సమావేశమై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, శ్రీనివాసచారి, వెంకట రామారావు, వీరభద్రరావు, శ్రీనివాస్, రమేశ్, వీరభద్రుడు, మధన్‌నాయక్, బైరెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

హైవే సర్వేను అడ్డుకున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

ఖమ్మంరూరల్: నాగ్‌పూర్ – అమరావతి హైవే నిర్మాణానికి మండలంలోని కామంచికల్‌లో శనివారం చేపట్టిన భూసర్వేను రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. భూనిర్వాసితుల తరఫున హైకోర్టులో కేసు విచారణలో ఉండగానే భూములు, బావులు, చెట్ల గుర్తింపునకు సర్వే చేయడం సరికాదన్నారు. మార్కెట్ ధర కంటే మూడింతలు రెట్టింపు పరిహారం చెల్లిస్తేనే భూమి ఇస్తామని తెలిపారు. రైతుల ఆందోళనతో రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు వెనుదిరిగారు. అనంతరం రైతులతో రెవెన్యూ అధికారులు చర్చించగా, పరిహారంపై తేల్చాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు వేములపల్లి సుధీర్, రాధాకృష్ణ, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, అనంతిని శ్రీనివాస్, శ్రీధర్, రఘు, పాటి వెంకటయ్య, ఉపేందర్‌రావు, రంగారావు, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.